ప్రజలంతా.. జగన్ పాలనకే మొగ్గు

జంగారెడ్డిగూడెం: ప్రజల మనస్సుల్లో 10కి 10 మార్కులు సాధించుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జంగారెడ్డిగూడెం మున్సిపల్ వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు అన్నారు. జంగారెడ్డిగూడెం 9వ సచివాలయం పరిధిలో శనివారం ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏ పథకం పొందాలన్నా తాము చాలా అవస్థలు పడేవారమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక అన్ని పథకాలు ఇంటి వద్దకే వస్తున్నాయని ప్రజలు పేర్కొనడం జగనన్న పాలనాదక్షతను తెలియజేస్తోందన్నారు. రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవశ్యకతను తెలియజేయాడానికి వెళుతుంటే ప్రజలు ఏపీ నీడ్స్ జగన్ అంటూ సంతోషంగా పేర్కొంటున్నారన్నారు. సంక్షేమం ముందుకు వెళ్లాలన్నా, అభివృద్ధి కొనసాగాలన్నా రాష్ట్రానికి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఉందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో డ్వాక్రా రుణమాఫీ చేస్తామని చంద్రబాబు మోసం చేశారని, కాని జగనన్న ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ చేస్తున్నారని మహిళలు సంతోషంగా పేర్కొంటున్నారన్నారు. ఆరోగ్యశ్రీ, జగనన్న ఆరోగ్య సురక్ష, అమ్మ ఒడి, ఆసరా, చేయూత ఇలా ఎన్నో పథకాలు తమకు ఆసరాగా నిలిచాయని మహిళలు తెలపడంతో రాష్ట్ర ప్రభుత్వం పట్ల వారి వైఖరి కూడా తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ దొంతు మాధవ్ కన్వీనర్, కౌన్సిలర్‌లు ఎల్‌వీఆర్, నేకూరి కిషోర్, ఉగ్గం ప్రసాద్, నాయకులు బత్తిని చిన్న, సొసైటీ మాజీ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు, చిప్పాడ వెంకన్న, గెద్దాడ శీను, షేక్ అమీర్, గుబ్బల అబ్బాస్, పంది రాజా, కంచర్ల విష్ణు, కంచర్ల నాగేశ్వరరావు, గూడపాటి రాధాకృష్ణ, నాడు శివ తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం 9వ సచివాలయం పరిధిలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ప్రజలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్స్‌ను అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పల్లె నిద్ర

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా జంగారెడ్డిగూడెం పట్టణంలో తొమ్మిదో సచివాలయం పరిధి 24వ వార్డులో శుక్రవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం పార్టీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం ఉదయం భారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి వార్డులో ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పాలనపై ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజాతీర్పులో భాగంగా బుక్‌లెట్ ప్రజల చేతిలో పెట్టి గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మార్కులు ఇవ్వమని అడిగితే చంద్రబాబు ప్రభుత్వానికి జీరో మార్కులు, జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి 10 మార్కులు ఇవ్వడం జరిగిందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజ నిర్వహించిన దృశ్యం

కొయ్యలగూడెం: అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమంలోని రామదుర్గా థియేటర్ సమీపంలో ఘనంగా నిర్వహించారు. అచ్యుతాన్ గురుస్వామి ఆశీస్సులతో గురుస్వాములు కాలనీ డి.రాంబాబు, కాకర్ల అప్పారావుల పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మాలాధారణ భక్తులు హాజరై పడిపూజోత్సవం నిర్వహించారు. చొప్పవరపు వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పరిసర మండలాలనుంచి స్వాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా 18 మెట్లకి ఉన్న ప్రాశస్త్యం 18 మెట్ల దేవతల పేర్ల గురించి స్వాములు అనుగ్రహ భాషణ చేశారు.

క్లుప్తంగా

ఘనంగా ఆజాద్ జయంతి



కొయ్యలగూడెం గ్రంథాలయంలో ఆజాద్ జయంతి నిర్వహిస్తున్న చిన్నారులు

కొయ్యలగూడెం: స్థానిక శాఖ గ్రంథాలయంలో భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిన గొప్ప వ్యక్తి , స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న అవార్డు గ్రహీత మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు అలంకరించి నివాళులు అర్పించారు. మౌలానా అబుల్ కలాం జీవిత చరిత్రను లైబ్రేరియన్ యు.రాముడు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రీడర్స్ గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వరూపం మహాసభకు వెళ్లిన ఎంఆర్‌పీఎస్ నాయకులు



టి.నరసాపురంలో హైదరాబాద్‌కు వెళుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

టి.నరసాపురం: విశ్వరూపం మహాసభకు టి.నరసాపురం నుంచి ఎంఆర్‌పీఎస్ నాయకులు తరలివెళ్లారు. శనివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో కృష్ణ మాదిగ అధ్యక్షతన జరిగే విశ్వరూపం మహాసభలో పాల్గొననున్నట్లు వారు వివరించారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. పోలవరం ఎంఆర్‌పీఎస్ ఇన్‌చార్జి లంక జబాబు, టి.నరసాపురం మండల ఎంఆర్‌పీఎస్ నాయకులు నారపాము దుర్గారావు, నార్లపాటి దుర్గారావు, బొక్కా శ్రీను తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

ప్రభుత్వ భవనాల పరిశీలన



అంకాలగూడెంలోని సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రెవెన్యూ అధికారులు

కొయ్యలగూడెం: పరింపూడి, అంకాలగుడెం గ్రామాలలోని నిర్మాణంలో ఉన్న సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా భవనాలను ఆర్డీవో అద్దయ్య శనివారం తనిఖీ చేశారు. ఈ నెల 22వ తేదీ నాటికి పెండింగ్ వర్క్స్ పూర్తి చేసి భవనాలను అప్పగించాల్సినదిగా సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను అదేశించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీ నిర్వహిస్తుండాలని తహసీల్దార్ పాశం నాగమణికి ఆదేశాలు జారీ చేశారు.

వైభవంగా ధనత్రయోదశి మహోత్సవం



విశేష అలంకరణలో మహాలక్ష్మీదేవి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పాత బస్టాండు వద్ద ఉన్న పాండురంగ స్వామి దేవస్థానంలో ధనత్రయోదశి మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ధనత్రయోదశి, శనిత్రయోదశి, మాస శివరాత్రి, నరక చతుర్థి పుణ్య, పవిత్ర దినాలు ఒకే రోజు వచ్చిన అరుదైన దినం కావడంతో విశేష పూజలు చేశారు. భక్తులు స్వయంగా ఈశ్వరునకు పంచామృత అభిషేకం, లక్ష్మీ సహిత కుబేర స్వామి వ్రతం, శనీశ్వరునికి కృష్ణతిలతో హోమం, మన్యు హోమం, రుద్రహోమం, మహాలక్ష్మి మూలమంత్ర హోమాలు నిర్వహించారు. మహాలక్ష్మీదేవికి విశేష అలంకరణ చేశారు. పూర్ణాహుతి నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు.

బాలలకు వ్యాసరచన పోటీలు

ఏలూరు (టూటౌన్): బాలల్లో నైపుణ్యాన్ని, ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలు దోహదపడతాయని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీవీ బుల్లి కృష్ణ అన్నారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలల దినోత్సవం ప్రత్యేకత అనే అంశంపై శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆదేశాల మేరకు స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయం వద్ద ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బుల్లి కృష్ణ మాట్లాడుతూ వ్యాసరచన వంటి వక్తృత్వ పోటీల వల్ల పోటీ తత్వంతో పాటు సభలు, సమావేశాల్లో చురుగ్గా పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర, జాతీయ, ప్రపంచ విష యాల పట్ల పరి జ్ఞానం పెంపొందే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిజాతగిరి వెంకన్న సన్నిధిలో..

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శనివారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సుప్రభాతసేవ, ఆరాధన, తోమాల సేవ, బాలభోగం, తీర్థప్రసాద గోష్టి తదితర పూజలు భక్తులు నిర్వహించుకున్నారు. స్వామి వారిని అయ్యప్ప, గోవింద మాలా ధారణ స్వాములు దర్శించున్నారు. తణుకు ఎర్రయ్య చెరువు, పాలకొల్లు అడవిపాలెం నుంచి భక్తులు కాలినడకన వచ్చి స్వామివారిని దర్శించుకున్నట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. స్వామివారిని జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య సతీమణితో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆర్డీవోకు ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం ఆర్డీవో దంపతులను దుశ్శాలువాతో సత్కరించి, స్వామి వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆర్డీవో అద్దయ్య దంపతులను సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి పోటీలకు రాజవరం విద్యార్థులు

కొయ్యలగూడెం: రాష్ట్రస్థాయి పోటీలకు రాజవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు డి.రామారావు శనివారం పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్కవరం గ్రామంలో సబ్ జూనియర్ బాలురు, బాలికలకు జిల్లా స్థాయి సెలెక్షన్లు నిర్వహించారన్నారు. దీనిలో రాజవరం హైస్కూల్ విద్యార్థులు ఐదుగురు పాల్గొనగా వారి ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు సెలక్టర్లు ఎంపిక చేశారన్నారు. సెలెక్ట్ అయిన వారిలో సయ్యద్ షరీఫ్, కె.హేమ, కాశీ విశ్వేశ్వరరావు, బి.నాగ సౌమ్య, ఎం.హర్షిత, ఎ.గీతకృష్ణ నరసింహ ఉన్నారన్నారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో గుంటూరులో నిర్వహించే పోటీలలో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు జె.శ్రీనివాస్ పేర్కొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రాజవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

జంగారెడ్డిగూడెం: ఈనెల 14వ తేదీ నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి పి.దుర్గారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, ఎంపీ కోటగిరి శ్రీధర్ పాల్గొని ప్రారంభిస్తారన్నారు. వారం రోజుల పాటు జరిగే గ్రంథాలయ వారోత్సవాల్లో 14వ తేదీన బాలల దినోత్సవం నిర్వహిస్తామన్నారు. అదే రోజు మధ్యాహ్నం విద్యార్థులకు చదరంగం పోటీలు ఉంటాయన్నారు. 15వ తేదీన పుస్తక ప్రదర్శన, క్విజ్ పోటీలు, 16న గ్రంథాలయ ఉద్యమకర్తలు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్యలను స్మరించుకుంటూ వారి జీవిత విశేషాలు తెలిపే కార్యక్రమం, చిత్రలేఖనం, మహిళా సాధికారితపై పోటీలు ఉంటాయన్నారు. అలాగే 17వ తేదీన కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు, మధ్యాహ్నం వ్యాసరచన గ్రంథాలయాలు, ఉపయోగాలపై వ్యాసరచన పోటీలు, 18న విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, తెలుగు భాష ప్రాముఖ్యతపై వక్తృత్వం, క్విజ్, క్రీడల పోటీలు, 19వ తేదీన దిశ చట్టం, మహిళా సాధికారిపై చర్చ ఉంటుందన్నారు. 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, సామూహిక స్వీయ పఠనం (ఐ లవ్ రీడింగ్), వారోత్సవాలు ముగింపు వేడుకలు, విజేతలకు బహుమతి ప్రధానం ఉంటుందన్నారు. అలాగే 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే లైసెన్స్‌లు రద్దు

భీమడోలు: బాణసంచా దుకాణాదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని లేని పక్షంలో లైసెన్సులు రద్దు చేస్తామని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక, శాశ్వత దుకాణాలను శనివారం సాయంత్రం ఎస్సై చావా సురేష్‌కుమార్‌తో కలిసి వారు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దుకాణదారులకు పలు సూచనలు చేశారు. బాణసంచా విక్రయ దుకాణాల వల్ల సూచికా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక నియమ నిబంధలను పాటించాలని లేని పక్షంలో కఠిన తీసుకుంటామన్నారు. దుకాణాల మధ్య 3 మీటర్ల దూరంగా ఉండాలని, సిగరెట్లు తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సహించేది లేదన్నారు.

కేవలం మూడు రోజులకే పర్మిషన్

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని తాత్కాలిక బాణసంచా విక్రయాల కేంద్రాలకు మూడు రోజులకు మాత్రమే పర్మిషన్ ఉంటుందని భీమడోలు అగ్నిమాపకశాఖాధికారి నాగరాజు శనివారం రాత్రి తెలిపారు. భీమడోలు అగ్నిమాపక శాఖ పరిధిలో భీమడోలు 9, ద్వారకాతిరుమల 10, ఉంగుటూరు 8, నిడమర్రు 8 బాణసంచా దుకాణాలకు తాత్కాలిక అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. వారికి శుక్రవారం నుంచి బాణా సంచా సామాగ్రిని అమ్మకాలు ప్రారంభించారని, ఆదివారం రాత్రితో గడువు ముగుస్తుందన్నారు.



భీమడోలులో బాణసంచా దుకాణాలను తనిఖీ చేస్తున్న సీఐ రవికుమార్, ఎస్సై సురేష్‌కుమార్

సమాజానికి దిశానిర్దేశం చేసే రచనలు రావాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమాజానికి దిశానిర్దేశం చేసే రచనలు సాహిత్యకారుల నుంచి రావాలని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి కోరారు. శనివారం స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి భవనంలో నిర్వహించిన అక్షరం ఆర్ట్స్ సంస్థ 26వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సాహిత్య రంగానికి, రచనలకు ఆదరణ తగ్గిందనే మాట అవాస్తవమన్నారు. నేటికీ విలువలతో కూడిన సాహిత్యానికి ప్రజాదరణ మెండుగా ఉందని చెప్పారు. మారుతున్న సామాజిక పరిస్థితుల నేపథ్యంలో తొలుత రేడియోలు, అనంతరం టీవీలు, ప్రస్తుతం మొబైల్ ఫోన్లు వంటివి ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, దానివల్ల సాహిత్యం కొంత వెనకబాటుకు గురైనా నేడు తిరిగి సాహిత్యరంగం బలం పుంజుకుందని తెలిపారు. కత్తి కంటే కలం గొప్పదని ఇప్పటికీ ప్రజలు విశ్వసిస్తున్నారని, ప్రజల్లో ఉన్న సానుకూలతను ఆకర్షణగా మలచాల్సిన బాధ్యత సాహిత్యకారులపై ఉందని అన్నారు. అక్షరం ఆర్ట్స్ అధ్యక్షుడు రాములు ఇప్పటికీ సామాజిక పరిస్థితులను ముఖ్యఅంశంగా తీసుకుని శతక రచనలు చేయడం అభినందనీయమన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు షేక్ సాబ్జి మాట్లాడుతూ సామాజిక స్పృహతో రాసే సాహిత్యమే పది కాలాల పాటు ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటుందని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన సాహిత్య పరిశోధకుడు లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కవులు, రచయితలు, కళాకారులు జీవనదుల్లా నిరంతరం చైతన్యంతో ప్రవహించాలన్నారు. అక్షరం ఆర్ట్స్ అధ్యక్షుడు రాములు రచించిన వెలుగు పూలు శతక పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. వేమన ప్రజా భాషలో ప్రజలకు అర్థమయ్యే భాషలో పద్య రచన చేసిన వారసత్వంలో రాములు కొనసాగుతున్నారని వారు కొనియాడారు. ఈ సందర్భంగా తెలుగు భాష అభివృద్ధికి విశేష కృషి చేస్తోన్న తెలుగు అధ్యాపకురాలు కొలిపాక అరుణకు సాహితీ సుధ అనే బిరుదుతో సత్కరించారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం నాట్య గురు మేదరమెట్ల శిరీష, ఆమె శిష్యులు చేసిన ఆనంద తాండవం, గణేష స్తుతి, ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యకుడు పి.మంగరాజు ఆలపించిన అభ్యుదయ గీతాలు ఆకట్టుకున్నాయి. ఆర్‌వీఎస్ రాజు, పెదపాటి రామకృష్ణ, గరికిపాటి కాళిదాసు, మోతే శ్రీనివాస నారాయణ, ఆలపాటి నాగేశ్వరావు తదితరులు మాట్లాడారు. వై.ఆనందనాయుడు, శుభశ్రీ,గురుశర్మ, డి.హేమ సుందర్, ప్రకాష్ రావు మొదలగు వారు పాల్గొనగా సభా సంచాలకులుగా నాగాస్త్ర వ్యవహరించారు.



అధ్యాపకురాలు అరుణను పురస్కారంతో సత్కరిస్తున్న అతిథులు

ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాము ప్రభుత్వాన్ని కోరారు. అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించారు. రాము మాట్లాడుతూ త్వరలోనే ఏలూరు జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో తమ సంఘం కార్యవర్గాలను నిర్మిస్తామన్నారు. అనంతరం సంఘ ఏలూరు జిల్లా కార్యవర్గాన్ని విస్తరించారు. ఉపాధ్యక్షులుగా ఇస్లావతు నారాయణ, నక్కా దుర్గారావు, సహాయ కార్యదర్శులుగా భూక్యా రవి, బి.రంగారావు, కె.వీరన్న, బి.వెంకటేశ్వరరావు, సంఘ మహిళా అధ్యక్షురాలిగా కె.రజనిని ఎన్నుకున్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలని నిరసన

కుక్కునూరు: పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం సీతారామనగరం గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ గత నెల రోజులుగా ఇజ్రాయెల్ సేనలు సామాన్యులపై దారుణ హత్యకాండను కొనసాగిస్తున్నాయన్నారు. గాజా ప్రాంతంలో తాగునీరు, ఆహారం, మందులు విద్యుత్‌ను నిలిపివేసి ప్రజలను ఆకలితో అలమటించేట్టుగా చేసి ఆ ప్రాంతం మొత్తాన్ని ఓపెన్ జైల్‌గా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులపై ప్రపంచ వ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతున్నా పశ్చిమ దేశాల మద్దతుతో ఇజ్రాయిల్, పాలస్తీనాపై ఇంకా దాడులకు తెగబడుతోందని విమర్శించారు. ఇజ్రాయెల్ దాడులలో సుమారుగా 25 వేల మంది పైగా తీవ్ర గాయాలపాలయ్యారన్నారు. ఇకనైనా ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు మడిపల్లి రమణయ్య, మండల నాయకులు కొప్పుల శ్రీనివాస్, కొమ్ము రమణమ్మ, గణపా నరసమ్మ, కొమ్ము లాలమ్మ పాల్గొన్నారు.



పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని కోరుతూ నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

రామాలయాన్ని పరిరక్షించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు పాతబస్టాండ్ వద్ద ఉన్న రామాలయాన్ని పరిరక్షించాలంటూ దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ట్రస్టీ బందిలి భీమరాజు మాట్లాడుతూ తమ తాత, తండ్రి తర్వాత నేడు తన ఆధ్వర్యంలో రామాలయంలో ధూప దీప నైవేద్యాలు సమర్పిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాను ఎస్సీ కులానికి చెందడం వల్లే అక్కడ నుంచి పంపేయాలనే ఉద్దేశంతో రామాలయాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దళిత సీనియర్ నాయకులు నేతల రమేష్ బాబు, ఆలగ రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం పాతబస్టాండ్ ఉన్న ప్రాంతంలో 1911 వరకు చింతాలగూడెం అనే మాలపల్లి ఉండేదని ఆనాటి మాలలు రామాలయాన్ని నిర్మించుకుని పూజలు చేసేవారని గుర్తుచేశారు. కాలక్రమేణా ఆ స్థలం మున్సిపాలిటీ అవసరాల నిమిత్తం తీసుకొని, మాలపల్లిని వెన్నవెల్లివారిపేట ఉన్న ప్రాంతానికి తరలించారని వివరించారు. ఇప్పటికీ రామాలయాన్ని రక్షిస్తూ పూజాధికాలు మాలలే నిర్వహిస్తున్నారని చెప్పారు. కొందరు నగర పాలక సంస్థ కమిషనర్, తహసీల్దార్లకు తప్పుడు ఫిర్యాదు చేసి ఆలయ తాళాలను స్వాధీనం చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రామాలయాన్ని రక్షించి బందిలి భీమరాజు సంరక్షణలో ఆలయ నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో కాపుదాసి రవి, దాసరి ఆంజనేయలు, భూపతి అప్పారావు, జాలా బాలాజీ, బత్తుల అశోక్,మేతర అజయ్ బాబు,చింతా దుర్గారెడ్డి, మాజీ ఎంపీటీసీ మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆయుర్వేద వారోత్సవాల సందర్భంగా అయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో స్థానిక రామకోటి ప్రాంగణంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు బీపీఎం నగేష్ బృందం 123 మందికి వైద్య పరీక్షలు నిర్వహిచారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. బొలిశెట్టి సురేష్ కుమార్, చెన్న వెంకట్రామయ్య, సన్నిధి సాయిరాం తదితరులు రోగులకు సేవలు అందించారు.

టీడీపీని భ్రష్టు పట్టిస్తున్నారు

గోపాలపురం నియోజకవర్గ వాణిజ్యసెల్ విభాగం అధ్యక్షుడు రత్నాజీ ఆవేదన

ద్వారకాతిరుమల: టీడీపీలో కష్టపడుతూ జెండా మోస్తున్న అసలైన నాయకులు, కార్యకర్తలను పట్టించుకోకుండా, అనర్హులను వెనకేసుకుని తిరుగుతూ పార్టీని కొందరు నేతలు భ్రష్టు పట్టిస్తున్నారని ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ వాణిజ్యసెల్ విభాగం అధ్యక్షుడు ఇమ్మడి రత్నాజీ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక వైష్ణవి అతిథి గృహంలో శనివారం ఏర్పాటు చేసిన అసమ్మతి నాయకుల విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కష్టకాలంలో టీడీపీకి తాము అండగా నిలిచామన్నారు. గతంలో పార్టీ పదవులు అనుభవించి, పార్టీ కార్యక్రమాల్లో పైరవీలు సాగించిన నేతలు కొందరు గడచిన నాలుగున్నరేళ్లుగా పార్టీకి దూరంగా ఉన్నారన్నారు. అయినా తాము పార్టీని భుజస్కంధాలపై మోస్తూ వచ్చామన్నారు. అలాంటి తమను ప్రస్తుతం కొందరు నేతలు పార్టీ కార్యక్రమాలకు దూరం పెడుతూ, ఇప్పటి వరకు ఇంట్లో పడుకున్న నాయకులను బయట తిప్పుతూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారన్నారు. వీటిని పార్టీ అధినాయకుడి దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కూరాకుల బుజ్జి మాట్లాడుతూ పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు ఈనెల 9న ద్వారకాతిరుమల ఎస్సీ కాలనీలో, 10 న బీసీ కాలనీలో బాబు షూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారన్నారు. అయితే అందులో బీసీ, ఎస్సీ, మైనారిటీలు, కాపులను కలుపుకోకుండా చంద్రబాబు దృష్టిలో పడేందుకు మాత్రమే కార్యక్రమాలను జరిపి, పార్టీని ఉద్ధరించినట్టు సోషల్ మీడియాలో గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా టీడీపీ మండల అధ్యక్షుడు లంకా సత్యన్నారాయణ(సత్తిపండు) తన సామాజిక వర్గం వారిని మాత్రమే ప్రోత్సహిస్తూ పార్టీని నాశనం చేస్తున్నారన్నారు. అంతేకాకుండా గడచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాల గెలుపునకు అన్నివిధాల సహకరించిన వారిని అందలమెక్కిస్తున్నారని ధ్వజమెత్తారు. వీటన్నిటిని అధిష్టానం దృష్టిలో పెట్టుకుని అందరికీ ఆమోదయోగ్యమైన ఎమ్మెల్యే అభ్యర్థిని గోపాలపురం నియోజకవర్గానికి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు రేపూరి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ నాయకులు కొరపాటి వెంకన్న, తాడేపల్లి సుబ్బారావు, కాపు నాయకులు గువ్వల మావుళ్లు, గువ్వల చంద్రం, వీరిశెట్టి రామారావు తదితరులున్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రత్నాజీ